రోజుకు రూ.50 వేల ఖర్చు

- నాలుగేళ్లలో రూ.14.8 కోట్లు
- ఇదీ కుక్కల నియంత్రణకు మున్సిపల్ కార్పొరేషన్ చేసిన వ్యయం
- అయినా తొలగని కుక్కల బెడద


కుక్కల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం

నిజామాబాద్‌అర్బన్ : నగరంలో కుక్కల నియంత్రణకు మున్సిపల్ కార్పొరేషన్ రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా కుక్కల దాడులు మాత్రం తగ్గడం లేదు. గత నాలుగేళ్లలో మున్సిపల్ కార్పొరేషన్, కుక్కలపై వెచ్చించిన ఖర్చు అక్షరాలా రూ. 14 కోట్ల పైనే. కుక్కలపై ఇంత ఖర్చు చేశారా అని నగర ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలపై చేసిన ఖర్చు, వచ్చిన ఫలితాలు చూస్తే అధికారులు భారీగా అవినీతికి పాల్పడ్డారనే అనుమానం నగర ప్రజల్లో కలుగుతోంది. నగరంలో 60 డివిజన్లు, నాలుగు లక్షల జనాభా ఉంది. వీటి పరిధిలో సుమారు 10 వేల వరకు కుక్కల సంచరిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు ఓ నివేదికను రూపొందించుకున్నారు. ఈ నివేదిక ప్రకారం ఆయా ప్రాంతాలలో కుక్కల బెడదను నివారించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. దీని ప్రకారం ప్రతి ఏటా కుక్కలను నియంత్రించి వాటి సంతానాన్ని తగ్గించేందుకు కార్యక్రమాలు చేస్తున్నారు. ఓ ప్రయివేటు సంస్థకు బాధ్యతలు అప్పగించారు. ఓ వెటర్నరీ డాక్టర్‌తోపాటు ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారు. నాలుగు సంవత్సరాలలో 9 వేల కుక్కలకు కు.ని ఆపరేషన్లతో స్టెరిలైజేషన్ కూడా చేసినట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. ఫిర్యాదు వచ్చినప్పుడు కుక్కల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో మాత్రమే నియంత్రణ చేయడం వల్ల సమస్యను పూర్తిస్థాయిలో నివారించలేకపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కుక్కల నియంత్రణ కోసం ఏర్పాటైన ప్రయివేటు సంస్థ ప్రతిరోజు 25 నుంచి 30 కుక్కలను పట్టుకొని వాటికి కు.ని ఆపరేషన్‌తో పాటు వ్యాక్సిన్ ఇవ్వాలన్నది నిబంధన ఉంది. కలెక్టరేట్ సమీపంలోనే మున్సిపల్ భవనంలో కుక్కల కుటుంబ నియంత్రణ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఒక్కో కుక్కపై రూ.1,650, ఇలా రోజుకు కుక్కల కోసం రూ.49,500 ఖర్చు చేస్తున్నారు. ఇలా నాలుగేళ్లలో మున్సిపల్ కార్పొరేషన్ కుక్కల నియంత్రణ కోసం రూ.14 కోట్ల 8 లక్షల 50 వేల ఖర్చు చేసినట్లు చెబుతున్నారు.

తగ్గని కుక్కల దాడులు

మున్సిపల్ కార్పొరేషన్ రూ.కోట్లు ఖర్చు చేసినా ఆశించిన మేరకు ఫలితాలు రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఆయా కాలనీలలో గుంపులుగుంపులుగా కుక్కలు సంచరిస్తూ దాడి చేస్తున్న ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. గాయత్రీ నగర్, ఆనంద్ నగర్, కంఠేశ్వర్, గౌతమ్ నగర్, దుబ్బ ప్రాంతాలలో మూకుమ్మడిగా కుక్కలు దాడులు చేసిన ఘటనలున్నాయి. మరో వైపు మున్సిపల్ కార్పొరేషన్ మాత్రం కుక్కల నియంత్రణ కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తమ నివేదికలో పేర్కొంటున్నారు.

చర్యలు చేపడుతున్నాం

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కుక్కల నియంత్రణ చర్యలు చేపడుతున్నం, ప్రైవేటు సంస్థకు బాధ్యతలు అప్పగించడం జరిగింది. వీటిని పకడ్బందీ చేపడుతున్న ఫిర్యాదు వచ్చినా తక్షణమే స్పందించి నివారణ చర్యలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు 9 వేల కుక్కలను నియంత్రించడం జరిగింది.

– శంకర్, అదనపు కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్

మున్సిపల్ రెవెన్యూ విభాగంలో బదిలీలు

నిజామాబాద్‌అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో భారీగా బదిలీలు చోటుచేసుకున్నాయి. ఇటీవల రెవెన్యూ విభాగం సూపరింటెండెంట్ నరేందర్ ఇంటిపై ఏసీబీ దాడి.. ఆ విభాగంపై అనేక ఆరోపణలు రావడంతో మున్సిపల్ కమిషనర్ ఒక్కొక్క విభాగంలో బదిలీలు చేపడుతూ వస్తున్నారు. ఒకే విభాగంలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారిని బదిలీ చేసి ఇతర బాధ్యతలు అప్పగించారు. అలాగే ఇంటి నెంబర్ల కేటాయింపులో కీలక విభాగమైన రెవెన్యూ విభాగంలోనూ కొంతమంది బిల్ కలెక్టర్లను వారి సొంత విభాగానికి బదిలీ చేశారు. పబ్లిక్ హెల్త్ వర్కర్లు మల్లేష్, లక్ష్మణ్, సాయిరాం, సాయి, విశ్వ ప్రకాష్, నరేష్, రాజేందర్, శంకర్‌లు సొంత విభాగానికి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో రెగ్యులర్ ఉద్యోగులను బిల్ కలెక్టర్‌లుగా నియమించారు. నూతన బిల్ కలెక్టర్లుగా లింబాద్రి, గంగాధర్, అశోక్, ప్రేమ్, ఎం.గంగాధర్, రఫీ, సాయన్న, శ్రీకాంత్, మహేష్, మధుసూదన్, ఎస్.గంగాధర్ సుమన్, రాజారాం, దత్తు, నరేందర్, ప్రమీలను నియమించారు. వీరితో పాటు ఇటీవల బదిలీపై బిల్ కలెక్టర్లుగా సలీముద్దీన్, మోహినుద్దీన్, రవికుమార్‌లు వచ్చారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా శ్రీనివాస్, సుభాష్, గంగమల్లు, బాల్‌రెడ్డి, శ్రీనివాసరావులను నియమించారు. దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఆపరేటర్లను మాత్రం బదిలీలు చేయలేదు.

బర్ధిపూర్ బైపాస్ రోడ్డు గుంతలమయం



నిజామాబాద్ రూరల్ : డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ గ్రామం నుంచి కేశాపూర్ కమాన్ వరకు డాక్టర్ వెంచర్‌ను కలుపుతూ పోతున్న రోడ్డు అధ్వానంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనచోదకులు భయపడుతున్నారు. వాహనాలు ఎక్కడ పల్టీ కొడతాయోమోనని జంకుతున్నారు. వర్షం పడితే చిన్న చెరువులో ప్రయాణం చేసినట్లు ఉంటోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయి. 8 నెలల క్రితం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రోడ్డు మరమ్మతులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు గుండా ఆరేపల్లి, కంజర, బర్ధీపూర్, ధర్మారం, నిజామాబాద్, హైదారాబాద్ వంటి ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మోపాల్: మండలకేంద్రంలోని కేజీబీవీలో స్కావెంజర్ పోస్టు కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో సుప్రజ గురువారం తెలిపారు. ఏడోతరగతి పాసైన వారు అర్హులని, వేతనం రూ.9750 చెల్లిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఏమైనా సందేహాలుంటే 63002 91724 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అగ్ని ప్రమాదం

ఖలీల్‌వాడి: షార్ట్ సర్క్యూట్ కారణంగా నగరంలోని రైల్వే కమాన్ వద్ద ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో మంటలు చెలరేగడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైరింజన్ మంటలను ఆర్పివేసింది. బోధన్ పీపీ రాణికి చెందిన ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగిందని, కూలర్‌తోపాటు ల్యాప్‌టాప్, ఫైల్స్ కాలిపోయినట్లు అధికారులు తెలిపారు.ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు దైవదర్శనానికి వెళ్లినట్లు చెప్పారు.

బాలిక అదృశ్యం

ధర్పల్లి: ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి చెందిన ఓ బాలిక ధర్పల్లి మండల కేంద్రంలో ఈ నెల 21న అదృశ్యమైనట్లు ఎస్సై రామకృష్ణ గురువారం తెలిపారు. గన్నారం మహిళ తన కూతురితో కలిసి ఈనెల 21న సిరికొండలోని బంధువుల వద్దకు వెళ్తూ సామగ్రి కొనుగోలు చేసేందుకు ధర్పల్లిలో ఆగారు. బాలిక ఐస్‌క్రీం కోసం వెళ్లి ఎంత సేపటికి తిరిగి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అటవీ ప్రాంతం పరిశీలన

సిరికొండ: మండల కేంద్రం శివారులో అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లు నరికిన ప్రాంతాన్ని ధర్పల్లి సీఐ భిక్షపతి గురువారం పరిశీలించారు. అడవికి సమీపంలోని తండాల్లోని గిరిజనులతో మాట్లాడారు. అడవిలో చెట్లను నరికిన వారిపై కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. డీఆర్వో గంగారం, బీట్ అధికారి శశాంక్ ఉన్నారు.

క్షయ నిర్మూలన కేంద్రం తనిఖీ

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లోని నాలుగో అంతస్తులో ఉన్న జిల్లా క్షయ నిర్మూలన కేంద్రంను గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి రాజశ్రీ తనిఖీ చేశారు. క్షయను గుర్తించడంలో ముచ్కూర్, ఎర్గట్ల, చౌట్‌పల్లి పీహెచ్‌సీలు వెనుకబడ్డాయని, కారణాలు తెలుసుకొని 100 శాతం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ దేవి నాగేశ్వరి, టీబీ కో–ఆర్డినేటర్ రవిగౌడ్ పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని ఆందోళన చెందొద్దు

నిజామాబాద్ రూరల్: రుణమాఫీ కాలేదని ఆందోళన చెందొద్దని రూరల్ తహసీల్దార్ అనిరుధ్ రైతులకు సూచించారు. గురువారం మండంలోని జలాల్‌పూర్ గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. అర్హులందరికి రుణమాఫీ తప్పకుండా అవుతుందని, అర్హులైన రైతులకు ఇప్పటికీ రుణమాఫీ కాకపోతే తక్షణమే వ్యవసాయ అధికారులకు పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారి జాదవ్ హీరా పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ జాతి మనుగడ

మోపాల్: మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని, చెట్లతోనే మానవ జాతి మనుగడ సాధ్యమని ఎంపీడీవో రాములు అన్నారు. గురువారం మండలంలోని బాడ్సి, సింగంపల్లి, కులాస్‌పూర్ గ్రామాల్లో 'నాటుదాం ఒక్క మొక్క.. అమ్మ పేరు మీద' కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ఎంపీవో కిరణ్‌కుమార్, ఈసీ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

స్వర్గయాత్ర రథం అందజేత

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) గ్రామాభివృద్ధి కమిటీకి రాజరాజేశ్వర ఆటోమొబైల్స్ యజమాని మురళీకృష్ణ తన తల్లిదండ్రులు ఈగ లక్ష్మి, చిన్న సాయిరెడ్డి జ్ఞాపకార్థం స్వర్గయాత్ర రథాన్ని గురువారం అందజేశారు. మురళీకృష్ణను వీడీసీ ప్రతినిధులు అభినందించారు. ఆటోమొబైల్ యజమాని హేమంత్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్డీవో ఆఫీస్‌కు వెళ్తున్న హరిసింగ్ అనే వ్యక్తి అనారోగ్యంతో కింద పడిపోయాడు. ఆ సమయంలో ఫోన్ మిస్ కావడంతో ఆయన భార్య, ట్రాఫిక్ ఏఎస్సై కోటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. అర్సపల్లిలోని ఇలియాస్ వద్ద ఫోన్‌ను స్వాధీనం చేసుకొని హరిసింగ్ భార్య హరితకు అందజేశారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి

సిరికొండ: వ్యవసాయ మోటార్లకు 3 కేవీఏఆర్ రేటింగ్ గల కెపాసిటర్లను బిగించుకోవాలని ట్రాన్స్‌కో డిచ్‌పల్లి డీఈ ఉత్తమ్ జాడే, రైతులకు సూచించారు. గడ్కోల్‌లో గురువారం ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు పొలంబాటలో డీఈ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కెపాసిటర్లను ఏర్పాటు చేసుకుంటే మోటార్లు కాలిపోవని, ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడకుండా ఉంటుందన్నారు. గడ్కోల్ సెక్షన్ ఏఈ శివకుమార్, ఏఏవో విజయ్‌కుమార్, సబ్ ఇంజినీర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌బీవీఆర్‌ఆర్ జయంతి


బోర్గాం(పి)లో ఆర్‌బీవీఆర్‌ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మోటాటిరెడ్డి సంఘం నేతలు


మోపాల్‌లో .. రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

మోపాల్: రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి (ఆర్‌బీవీఆర్‌ఆర్) 155వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మోపాల్ మండల కేంద్రంలో రెడ్డి సంక్షేమ సంఘం, బోర్గాం(పి) మోటాటిరెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, బోర్గాం(పి) సంఘం నాయకులు రమేష్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్య అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘనపూర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం, చికిత్స కన్నా నివారణ మిన్న, దోమల నియంత్రణ ద్వారా దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్ గున్యా, తదితర వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి ఆదివారం ఉదయం 10.10 గంటలకు ప్రతి ఇంటి వద్ద నీటి నిల్వలను తొలగిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనారిటీల వ్యతిరేకి కాంగ్రెస్

ఖలీల్‌వాడి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలకు వ్యతిరేకంగా పని చేస్తోందని ఎంబీటీ పార్టీ రాష్ట్ర ప్రతినిధి మజీద్ ఉల్లాహ ఖాన్ అన్నారు. గురువా రం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్.. ఉత్తర్ ప్రదేశ్‌లో యోగి సర్కార్‌ను తలపిస్తుందని మండిపడ్డారు. ఎంఐఎం, బీఆర్‌ఎస్‌తో దోస్తీ అంటూ మైనార్టీలు మోసపోయారని వ్యాఖ్యానించారు. మరోసారి మైనార్టీలను మోసం చేసేందుకు ఎంఐఎం, కాంగ్రెస్‌తో దోస్తీ చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇప్పటికైనా మైనార్టీలు మేల్కోవాలన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు నిలబడినా ఎంబీటీ తరపున టిక్కెట్లు ఇస్తామన్నారు. కాంగ్రెస్, ఎంఐఎంలను నమ్మవద్దని అన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలి



సుభాష్‌నగర్: మురుగు కాల్వలలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన బాలిక అనన్య కుటుంబానికి రూ.50లక్షలు పరిహారం చెల్లించాలని ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్, సందు ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నగరంలోని ఆనంద్ నగర్‌లో అనన్య పడి మృతిచెందిన ఘటనా స్థలాన్ని వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మురుగు కాల్వల నిర్వహణలో మున్సిపల్ కార్పొరేషన్ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. పరిహారం వెంటనే చెల్లించాలని లేకుంటే బాధిత కుటుంబ సభ్యుల తరపున వినియోగదారుల కమిషన్(కోర్టు)కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రతినిధులు వీఎస్ వర్మ, గైని రత్నాకర్, మహాదేవుని శ్రీనివాస్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగ

సిరికొండ: మండలంలోని సర్పంచ్ తండాలో తీజ్ పండుగను గిరిజనులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. పెళ్లికాని యువతులు తొమ్మిది రోజుల క్రితం నానబెట్టగా వచ్చిన గోధుమ మొలకలకు వారి సంప్రదాయరీతిలో పూజలు చేశారు. పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి గోధుమ మొలకలను చెరువులో నిమజ్జనం చేశారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా


ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బిగాల, బీఆర్ఎస్ నేతలు

నిజామాబాద్‌అర్బన్: రైతులందరికి ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రుణమాఫీపై ధర్నా కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేయకుండా సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ జరగలేదంటూ బ్యాంకుల మీదకి తోసేస్తున్నారన్నారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలి సంతకం రుణమాఫీ మీద చేస్తానని చెప్పి మాట మార్చిన సీఎం రేవంత్ రెడ్డి రైతులను మోసం చేశారని పేర్కొన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తానని చెప్పి కొందరికే మాఫీ చేయడం సరికాదన్నారు. వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి లేకుంటే మరో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. నాయకులు రామ్ కిషన్ రావు, నగర అధ్యక్ష కార్యదర్శులు సిర్ప రాజు, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్, రవిచందర్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గెలిచాక మాట మార్చారు'


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి: అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి గెలిచాక మాట మార్చారని ధర్పల్లి మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్ కాంగ్రెస్ నేతలను విమర్శించారు. బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ పిలుపు మేరకు రూ.2 లక్షల రుణమాఫీని ఆంక్షలు లేకుండా అమలు చేయాలని డిచ్‌పల్లిలో గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డికి జ్ఞానోదయం కలగాలని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 40 శాతం వరకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీని తప్పుదోవ పట్టించేందుకే సాంకేతిక కారణాలను సాకుగా చూపుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాటకు కట్టుబడిరుణాన్ని మాఫీ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు సాంబార్ మోహన్, రమేశ్ యక్, దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, నల్లవెల్లి సాయిలు, తనూజ శ్రీనివాస్ రెడ్డి, మొచ్చ శ్రీనివాస్, బుల్లెట్ అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని అందించాలి

నిజామాబాద్‌రూరల్: పిల్లలకు పోషకాహారం అందే విధంగా చూడాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం గంగస్థాన్ ఫేజ్ -2 వివేకానంద ధ్యాన మందిరంలో సూపర్‌వైజరీ సప్లిమెంటరీ ఫీడింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోషకాహార లోపాన్ని తగ్గించడానికి మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లా సంక్షేమాధికారిణి ఎస్‌కే రసూల్‌బీ, డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహ తనిఖీ

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న శిశుగృహాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. పిల్లలకు ఏవిధమైన ఆహారాన్ని అందిస్తున్నారో పరిశీలించారు.

బాధ్యతల స్వీకరణ

సిరికొండ: మండల వ్యవసాయ అధికారిగా నర్సయ్య గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నర్సయ్య వేల్పూర్ నుంచి సిరికొండకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఏవోగా పని చేసిన వెంకటేష్ ధర్పల్లి మండలానికి బదిలీ అయ్యారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,000	వెండి (కిలో)	88,500
22 క్యారెట్స్	68,242	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	35	50
బెండకాయ	15	30	పచ్చిమిర్చి	20	40
బీరకాయ	30	60	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	50	70	గోబిగడ్డ	25	50
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	60
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	70	90	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	70			

– సుభాష్‌నగర్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



నిజామాబాద్‌అర్బన్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మకరంద్ అన్నారు. గురువారం తన చాంబర్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియపై టౌన్ ప్లానింగ్ విభాగంతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటేనే అనుమతులు జారీ చేయాలన్నారు. డిప్యూటీ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ, అనుపమ తదితరులున్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఆయ్ (తెలుగు) - 10.20, 4.20, 10.30 తంగలాన్ (తెలుగు) 1.20, 7.20
స్క్రీన్-2	డిమోంటి కాలనీ-2 (తెలుగు) - 10.25, 10.20, స్త్రీట్-2 (హిందీ) - 1.30, కమిటీ కుర్రోళ్లు (తెలుగు)-4.30 మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 7.30
స్క్రీన్-3	స్త్రీట్-2 (హిందీ) - 10.20, 10.20, మారుతీనగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 1.20, డిమోంటి కాలనీ-2 (తెలుగు) - 4.20, డబుల్ ఇస్మార్ట్ (తెలుగు) 7.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	స్త్రీట్-2 (హిందీ) -10.00, 4.30, 10.50, కమిటీ కుర్రోళ్లు (తెలుగు) - 1.15, 7.45
స్క్రీన్-2	ఏలియన్ రోములస్ (తెలుగు) - 10.15, ఆయ్ - 1.00, తంగలాన్ - 4.05, స్త్రీట్ -2 (హిందీ) - 7.25, మారుతీనగర్ సుబ్రహ్మణ్యం - 10.40
స్క్రీన్-3	డిమోంటి కాలనీ-2 (తెలుగు) - 10.20, 4.40, 10.30, స్త్రీట్-2 (హిందీ) - 1.25, ఏలియన్ రోములస్ (ఇంగ్లీష్) - 7.45
స్క్రీన్ -4	వెడ్డింగ్ డైరీస్ (తెలుగు)-10.55, మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) - 1.35, 7.40, రేవు (తెలుగు)-4.45, ఇంద్ర (తెలుగు) - 10.50
దేవి	తంగలాన్ (తెలుగు)
నటరాజ్	కమిటీ కుర్రోళ్లు (తెలుగు)
విజయ్	మిస్టర్ బచ్చన్ (తెలుగు)
లలితామహల్	డబుల్‌ఇస్మార్ట్ (తెలుగు)

సంక్షిప్తం

హైదరాబాద్‌కు తరలిన మాస్‌లైన్ శ్రేణులు

సిరికొండ: మండలానికి చెందిన సీపీఐఎంఎల్ మాస్‌లైన్ శ్రేణులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఇందిరాపార్క్ వద్ద గురువారం నిర్వహించిన ధర్నాకు వారు తరలివెళ్లారు. రమేష్, లింబాద్రి, అనీస్, కిషోర్ వెళ్లారు.

సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయాలి

ధర్పల్లి: కోల్‌కతాలో జరిగిన అత్యాచార ఘటనపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పీడీఎస్‌యు ఆధ్వర్యంలో ఆడపిల్లలపై జరుగుతున్న అమానుష ఘటనలను ఖండిస్తూ గురువారం సెమినార్ నిర్వహించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

నిజామాబాద్‌అర్బన్: ఆదిలాబాద్‌లోని మావాల మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల, కళాశాలల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ శశిధర్ డిమాండ్ చేశారు. గురువారం నగర ఏబీవీపీ కార్యాలయంలో శశిధర్ మాట్లాడుతూ.. పాఠశాల ప్రిన్సిపల్ సంగీత విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని, ఆమెపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

అందరికి రుణమాఫీ చేయండి

నిజామాబాద్‌అర్బన్: రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కలిసి విన్నవించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు మహిపాల్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని భారతీ రాణి కాలనీలో వేసుకున్న నివాస గృహాలను తొలగించవద్దని, అధికారికంగా పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కాలనీవాసులు గురువారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. కొందరు మోసపోయి అక్కడ ప్లాట్లు కొనుగోలు చేశారని, ఆ తర్వాత అనుమతి లేదని తెలిసిందని బాధితులు వాపోయారు. వారు ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిశారు. డిప్యూటీ మేయర్ ఇద్రీస్‌ఖాన్, కార్పొరేటర్లు మునావార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కిసాన్ గంజ్‌లోని ఉమామహేశ్వరి కల్యాణ మండపంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో 8–45 మధ్య వయసు గల 400 మంది వరకు పాల్గొన్నారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 31, సెప్టెంబర్ 1న రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, జిల్లా క్రీడల అధికారి ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

ఖలీల్‌వాడి: నీట్‌లో ర్యాంక్ సాధించిన నిషితారెడ్డిని ఏసీపీ రాజావెంకట్ రెడ్డి గురువారం సన్మానించారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లె రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిషితారెడ్డిని ఏసీపీ తోపాటు ఆర్‌బీవీఆర్‌ఆర్ స్కూల్ యాజమాన్యం శాలువాతో సన్మానించారు.